క్లుప్తంగా

గుడి నిర్మాణానికి విరాళం



బచ్చన్నపేట: మండలంలోని బండనాగారంలో నూతనంగా నిర్మిస్తున్న దుర్గామాత ఆలయానికి ఎర్రోజు యుగరాజు రూ. 50 వేల విరాళాన్ని అందించినట్లు ఆలయ కమిటీ చైర్మన్ శివరాత్రి రాజనర్సు తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఆలయ నిర్మాణ పనులు జరుగుతున్నాయని, త్వరలోనే దుర్గామాత ఉత్సవాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. అలాగే ఆలయ నిర్మాణానికి సహకరించిన దాతలందరికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మానెపల్లి దేవయ్య, సవాదు మల్లారెడ్డి, ఏల్ల చెంద్రారెడ్డి , రాపెల్లి చక్రపాణి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

‘మద్యం షాపులను తొలగించాలి’



స్టేషన్‌ఘన్‌పూర్: మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ ఎదుట ఉన్న మద్యం షాపులను తొలగించాలని స్థానికులు కోరారు. ఈ మేరకు బుధవారం సీఐకి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీపీ ఎదుట ఏర్పాటు చేసిన మద్యం షాపులతో యువతులు, మహిళలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. గతంలో ఈ వియంపై వినతి పత్రాలు ఇచ్చినా పట్టించుకోలేదని ఇప్పటికైనా మద్యం షాపులను వేరేచోటికి మార్చాలని కోరారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి



చిల్పూరు: మండలంలోని రాజవరం గ్రామానికి చెందిన ఉప సర్పంచ్ కన్నెబోయిన సంతోష్‌కు చెందిన పాడి గేదె విద్యుదాఘాతంతో బుధవారం మృతి చెందింది. సంతోష్ రోజు మాదిరిగా ఉదయం గేదెకు నీరు తాగించేందుకు బోరుబావి వద్దకు తీసుకెళ్లాడు. నీరు తాగుతుండగా బోరుకు ఉన్న సర్వీస్ కనెక్షన్ వైరు పేలిపోయి ఉంది. దీంతో విద్యుదాఘాతానికి గురై గేదె మృతి చెందింది. గత నెల రోజుల క్రితం గేదెను అంగడిలో రూ.75 వేలు వెచ్చించి తీసుకొచ్చాడు. గేదె ద్వారా వచ్చే పాలతో అప్పులు తీరుతాయని అనుకుంటే ఇలా జరిగిందని ఆవేదన వ్యక్తం చేశాడు. సంతోష్‌ను ప్రభుత్వం ఆదుకోవాలని సర్పంచ్ మారేపల్లి తిరుమలకృష్ణమోహన్‌రెడ్డి, ఎంపీటీసీ లలితశ్యాంకుమార్‌రెడ్డి కోరారు.

ముందస్తు పోస్టులతో ప్రజల్ని గందరగోళపర్చకండి



దేవరుప్పుల: తెలంగాణ ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాల విషయమై సోషల్ మీడియాలో ముందస్తు పోస్టులు పెట్టి ప్రజల్ని గందరగోళానికి గురిచేయొద్దని తహసీల్దార్ హుస్సేన్ సూచించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ అధికారికంగా పలు పథకాల దరఖాస్తు నమూనా, దానికి కావాల్సిన ప్రతులపై ఊహాగానాలతో పోస్టులు చేయడం చట్ట విరుద్ధమన్నారు. ప్రజాపాలనలో ప్రజలు ఇచ్చే దరఖాస్తులకు మీసేవలో కుల, ఆదాయ, నివాస ధ్రువీకరణ పత్రాలు కావాలని పొందుపర్చలేదన్నారు. ఆయా గ్రామాల్లో నిర్దేశిత తేదీల్లో నిర్వహించే ప్రజాపాలన దరఖాస్తులను పొంది తగు వివరాలతో కేవలం ఆధార్, రేషన్ కార్డుల జిరాక్సు ప్రతులు జతపరిచి ఇస్తే సరిపోతుందని వివరించారు. నాయబ్ తహసీల్దార్ వినోద్ కుమార్, ఆర్ఐ రాజు పాల్గొన్నారు.

6 గ్యారంటీలకు దరఖాస్తు చేసుకోండి

కొడకండ్ల: ప్రభుత్వం అందించే ఆరు గ్యారంటీ సంక్షేమ పథకాల కోసం అర్హులైన ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ధరావత్ సురేష్‌నాయక్ కోరారు. బుధవారం ఆయన మండలకేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలకనుగుణంగా నూతనంగా సీఎం రేవంత్‌రెడ్డి సారధ్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీ పథకాల అమలుకు శ్రీకారం చుట్టిందని, గురువారం నుంచి 2024 జనవరి 6వ తేదీ వరకు అధికారుల బృందాలు గ్రామాల్లోకి వచ్చి దరఖాస్తులు స్వీకరిస్తారని, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అర్హులైన ప్రతి ఒక్కరూ దరఖాస్తులు చేసుకొనేలా కృషి చేయాలని ఆయన కోరారు.

జిల్లాకు మంచిపేరు తేవాలి



కొడకండ్ల: సమావేశంలో మాట్లాడుతున్న డీపీఓ రంగాచారి



స్టేషన్‌ఘన్‌పూర్: మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ సుహాసిని, ఆర్డీఓ రామ్మూర్తి



బచ్చన్నపేట: మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారి వినోద్‌కుమార్



నర్మెట: మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ అనిల్‌కుమార్



లింగాలఘణపురం: మాట్లాడుతున్న స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పింకేశ్‌కుమార్

జనగామ రూరల్/బచ్చన్నపేట/లింగాలఘణపురం / రఘునాథపల్లి: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన ఆరు గ్యారంటీల దరఖాస్తులను తీసుకోవడంలో అధికారులు చిత్తశుద్ధితో పని చేసి జిల్లాకు మంచి పేరు తేవాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పర్మార్ పింకేశ్‌కుమార్ కోరారు. బుధవారం జనగామ పట్టణంతోపాటు లింగాలఘణపురం, రఘునాథపల్లి మండలాల్లో అధికారులతో నిర్వహించిన ప్రజాపాలన సన్నాహక సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆరు గ్యారంటీలకు 28వ తేదీ నుంచి దరఖాస్తుల స్వీకరణ ఉన్నందున అధికారులు తగిన ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. ఒక కుటుంబంలో దరఖాస్తు ఒక్కటే ఉండాలని, తల్లిదండ్రుల నుంచి వేరుపడిన కుమారులు, కోడళ్లు ఉంటే వారి వద్ద కూడా దరఖాస్తు తీసుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరికీ దరఖాస్తు ఫారాలు అందుబాటులో ఉంటాయని ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. అలాగే లింగాలఘణపురం మండలంలోని నెల్లుట్ల గ్రామ పంచాయతీలో, బచ్చన్నపేటలో ప్రజా పాలన ఏర్పాట్లను ఆయన పరిశీలించి పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలన్నారు. ఆయా సమావేశాల్లో అదనపు కలెక్టర్ సుహాసిని, జిల్లా ఆడిట్ ఆఫీసర్ శంకర్, స్పెషల్ ఆఫీసర్ లత, డీఏఓ వినోద్‌కుమార్, ఎంపీపీలు జయశ్రీ, మేకల వరలక్ష్మి, ఎంపీడీఓలు సురేందర్, రఘురామకృష్ణ, తహసీల్దార్లు విశాలాక్షి, పురం యుగేందర్, వినయలత, ఎంపీఓలు మల్లికార్జున్, కృష్ణ, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ బాలకృష్ణ, సీపీఓ ఇస్మాయిల్ పాల్గొన్నారు.

లింగాలఘణపురం మండలంలో గ్రామసభల తేదీలు..

28న నెల్లుట్ల, కుందారం, 29న వనపర్తి, కొత్తపల్లి, నాగారం, మంథోనిగూడెం, 30న చీటూరు, కళ్లెం, జనవరి 2న వడిచర్ల, మాణిక్యాపురం, ఏనెబావి, 3న నేలపోగుల, లింగాలఘణపురం, 4న జీడికల్, రామచంద్రగూడెం, కిష్టగూడెం, పటేల్‌గూడెం, 5న నవాబుపేట, సిరిపురం, 6న బండ్లగూడెం, గుమ్మడవెల్లి గ్రామాల్లో దరఖాస్తులు తీసుకోవడం జరుగుతుందని వివరించారు.

గ్రామసభలు సమర్థవంతంగా నిర్వహించాలి

స్టేషన్‌ఘన్‌పూర్: నేటినుంచి చేపట్టే ప్రజా పాలన గ్రామ సభలను సమర్థవంతంగా నిర్వహించాలని అడిషనల్ కలెక్టర్ సుహాసిని, ఆర్డీఓ వాసం రామ్మూర్తిలు అధికారులు, ప్రజాప్రతినిధులకు సూచించారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం నియోజకవర్గం స్థాయి తహసీల్దార్లు, ఎంపీడీఓలు, స్పెషల్ ఆఫీసర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేటి నుంచి జనవరి 6వ తేదీ వరకు గ్రామ సభల ద్వారా ప్రజలు ఇచ్చే ప్రతీ ఒక్క దరఖాస్తును అధికారులు స్వీకరించాలని అన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ మారపాక రవి, ఎంపీపీలు కందుల రేఖ, మేకల వరలక్ష్మి పాల్గొన్నారు.

ప్రజా పాలనలో అందరూ పాల్గొనాలి

నర్మెట: ప్రజా పాలనలో అధికారులు, ప్రజలు పాల్గొనాలని జెడ్పీ సీఈఓ అనిల్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ తేజావత్ గోవర్ధన్ అధ్యక్షతన జరిగిన సదస్సులో పంచాయతీ కార్యదర్శులు, అధికారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి (గురువారం) నుంచి 2024 జనవరి 6వ తేదీ వరకు గ్రామాల్లో సభలను నిర్వహిస్తామని అన్నారు. ప్రభుత్వం అందజేయనున్న ఆరు గ్యారంటీ పథకాలకు ఒకే ఫారంలో దరఖాస్తు చేసుకోవాలని, అందుకు కావల్సిన అన్ని ఏర్పాట్లను కూడా చేశామన్నారు. ఆర్డీఓ మురళీకృష్ణ, జెడ్పీటీసీ మాలోత్ శ్రీనివాస్, జెడ్పీ కోఆప్షన్ సభ్యులు ఎండి. గౌస్, తహసీల్దార్ మున్ననూరి వెంకన్న, ఎంపీడీఓ ఖాజామొయినొద్దీన్ పాల్గొన్నారు.

విజయవంతం చేయాలి

కొడకండ్ల/పాలకుర్తి టౌన్: ఆరు గ్యారంటీ పథకాల అమలు కోసం గురువారం నుంచి జనవరి 6వ తేదీ వరకు నిర్వహించే ప్రజాపాలన కార్యక్రమాన్ని అధికారులు, సిబ్బంది సమష్టి భాగస్వామ్యంతో విజయవంతం చేయాలని నియోజకవర్గ ప్రత్యేక అధికారి, డీపీఓ రంగాచారి కోరారు. కొడకండ్ల, పాలకుర్తిలో ప్రజాపాలనపై నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రెండు టీంల బృందం మండలంలోని అన్ని గ్రామాల్లో దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందన్నారు. అర్హులైన వారంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డీపీఓ అన్నారు. 28వ తేదీ ఉదయం మొండ్రాయి, ఏడునూతులలో మధ్యాహ్నం గిర్నితండ, నర్సింగాపురంలో 29న ఉదయం మైదంచెరువుతండ, రంగాపురంలో మధ్యాహ్నం నీలిబండతండా, గుమ్మలబండతండాల్లో, 30న ఉదయం రామవరం, కొడకండ్లలో, మధ్యాహ్నం చెరువుముందుతండ, హక్యాతండల్లో, జనవరి 2వ తేదీ ఉదయం రామేశ్వరం, రామన్నగూడెంలో మధ్యాహ్నం రామేశ్వరం, రామన్నగూడెంలో 3న ఉదయం పెద్దబాయితండ, రేగులలో మధ్యాహ్నం కడగుట్టతండ, రేగులతండల్లో 4న బోడొనికుంటతండలో దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని డీపీఓ తెలిపారు. డీఆర్‌డీఏ ఏపీఓ మొగులప్ప, ప్రత్యేక అధికారి రవీందర్, కుమారస్వామి, ఎంపీపీ జ్యోతి, నాగిరెడ్డి, ఎంపీడీఓ అశోక్‌కుమార్, తహసీల్దార్ వెంకటేశం, జెడ్పీటీసీ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అందరూ భాగస్వాములు కావాలి

బచ్చన్నపేట: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ప్రజా పాలనలో అధికారులు, ప్రజలు అందరూ భాగస్వాములు కావాలని జిల్లా వ్యవసాయ అధికారి వినోద్‌కుమార్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని రైతు వేదిక భవనంలో పంచాయతీ కార్యదర్శులు, అధికారులకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి (గురువారం) నుంచి జనవరి 6వ తేదీ వరకు గ్రామాలో సభలను నిర్వహిసామని అన్నారు. ప్రభుత్వం అందజేసే ఆరు గ్యారంటీ పథకాలకు ఒకే ఫారంలో దరఖాస్తు చేసుకోవాలని, అందుకు అవసరమైన ఏర్పాట్లను కూడా చేశామన్నారు. ఎంపీపీ బావండ్ల నాగజ్యోతి, తహసీల్దార్ విశాలాక్షి, ఎంపీడీఓ రఘురామకృష్ణ, మండల స్పెషలాఫీసర్లు ఇస్మాయిల్ పాల్గొన్నారు.

దరఖాస్తుల స్వీకరణకు సహకరించాలి

దేవరుప్పుల: ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం విజయవంతానికి నేటి నుంచి అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు సహకరించాలని మండల ప్రత్యేక అధికారి, డీఈఓ, కె.రాము సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ బస్వ సావిత్రి అధ్యక్షతన ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ కార్యాచరణపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. మండల ప్రత్యేక అధికారి హుస్సేన్, ఎంపీడీఓ వడ్డెపల్లి ఉమామహేశ్వర్, తహసీల్దార్ హుస్సేన్, ఎంపీఓ టి.సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని శివునిపల్లికి చెందిన కొలిపాక పద్మ, చెన్నూరి మహేశ్వరీలకు మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎమ్మెల్యే కడియం శ్రీహరి పంపగా బుధవారం వాటిని ఎంపీటీసీ బూర్ల లతశంకర్ పంపిణీ చేశారు. ఎంపీటీసీ గుర్రం రాజు, బూర్ల రాజు, గుర్రం వినయ్, జక్కుల ప్రభాకర్, తిరుపతి పాల్గొన్నారు.

నిరుపేదలను ఆదుకునేలా ‘ప్రజా పాలన’ ఉండాలి

చిల్పూరు: అర్హులైన నిరుపేదలను ఆదుకునేలా ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ ఉండాలని, ఈ విషయంలో రాజకీయాలు చేయొద్దని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా నియోజకవర్గం ఇన్‌చార్జ్ మారపాక రమేశ్ అధికారులను కోరారు. మండలంలోని కృష్ణాజీగూడెంలో బుధవారం విలేకరులతో ఆయన మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో పేదలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొని అసెంబ్లీ ఎన్నికల్లో మార్పు కోరుకుని కాంగ్రెస్ పార్టీని గెలిపించారని తెలిపారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన ఆరు గ్యారంటీలను రాజకీయాలకు అతీతంగా పేదలకు అందేలా చూడాలన్నారు.

ఎన్నిక



మంచాల అనిల్

జఫర్‌గఢ్: వడ్డెగూడెం కాంగ్రెస్ గ్రామ శాఖ నూతన అధ్యక్షుడిగా మంచాల అనిల్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యాడు. ఈ మేరకు పార్టీ మండల శాఖ అధ్యక్షుడు నూకల ఐలయ్య బుధవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. గత కొంత కాలం నుంచి కాంగ్రెస్‌లో క్రియాశీలకంగా పనిచేస్తున్న మంచాల అనిల్‌ను కాంగ్రెస్ నూతన గ్రామ శాఖ అధ్యక్షుడిగా ఎన్నుకోవడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా మంచాల అనిల్ విలేకరులతో మాట్లాడుతూ గ్రామంలో పార్టీని మరింత బలోపేతం చేయడంతో పాటు ప్రభుత్వం చేపట్టే సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయనున్నట్లు తెలిపారు. తన ఎన్నికకు సహకరించిన పార్టీ మండల నాయకులు, కార్యకర్తలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ప్రధాని సంకల్పం.. వికసిత్ భారత్



మాట్లాడుతున్న జీవీఆర్

చిల్పూరు: ప్రధాని నరేంద్ర మోదీ సంకల్పం.. ‘వికసిత్ భారత్’ అని బీజేపీ రాష్ట్ర నాయకుడు, మాజీ మంత్రి డాక్టర్ గుండె విజయరామారావు అన్నారు. మండలంలోని ఫత్తేపూర్‌లో బుధవారం చిన్నపెండ్యాల ఎస్‌బీఐ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యత, ప్రధాని ప్రవేశ పెట్టిన పేదల సంక్షేమ పథకాలపై బ్యాంకు మేనేజర్ మంజుల అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లడుతూ ప్రధాని మోదీ పేదల సంక్షేమం కోసం ఎన్నో పథకాలను ప్రవేశ పెట్టగా అవి ప్రచారానికి నోచుకోక చాలా మందికి అందడం లేదన్నారు. ఇక నుంచి పార్టీ కార్యకర్తలు సంక్షేమ పథకాలు పేదలకు అందే విధంగా చూడాలని కోరారు. అనంతరం సబ్సిడీపై డ్రోన్ ద్వారా పంటలపై క్రిమిసంహారక మందు పిచికారీ చేయడంపై రైతులకు అవగాహన కల్పించారు. సర్పంచ్ రూప్లానాయక్, గుగులోత్ మధు, దినేష్, అరుణ్, లాలు, శంకర్, సాదం భీమన్న, పార్వతీ ఇండేన్ గ్యాస్ డీలర్ కొండ రమేష్, ఐలోని అంజిరెడ్డి, తోకల సంపత్‌రెడ్డి, బ్యాంక్ కౌన్సిలర్లు నీల రాకేష్, నాగబండి సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ విధానాల అమలుకు పాటుపడదాం



మాట్లాడుతున్న ఎంపీపీ సావిత్రి

దేవరుప్పుల: తెలంగాణలో ఏర్పడిన కొత్త ప్రభుత్వ విధానాల అమలుకు ప్రజాప్రతినిధులుగా పాటుపడదామని ఎంపీపీ బస్వ సావిత్రి అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ వడ్డెపల్లి ఉమామహేశ్వర్ అధ్యక్షతన జరిగిన సర్వసభ్య సమావేశంలో తొలుత జెడ్పీచైర్మన్ పాగాల సంపత్‌రెడ్డి మృతి పట్ల సంతాప సూచికంగా మౌనం పాటించారు. అనంతరం జరిగిన మండల సభలో పలు శాఖల పురోగతిపై సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత ప్రభుత్వం మాదిరిగానే ఈ ప్రభుత్వం హయాంలో అమలు చేసే ప్రజాసంక్షే పథకాలు అర్హులకు అందేలా కృషి చేస్తామని, ఇందుకు కొత్త ప్రభుత్వంలో తమపై వివక్షత చూపకుండా ప్రొటోకాల్ పాటించేలా అధికార యంత్రాగం పాటుపడాలన్నారు. వైస్‌ఎంపీపీ కత్తుల విజయ్‌కుమార్‌రెడ్డి, ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, అనుబంధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా ఉద్యమాలే ఊపిరిగా పనిచేయాలి



మాట్లాడుతున్న రాజు

జఫర్‌గఢ్: ప్రజా ఉద్యమాలే ఊపిరిగా కార్యకర్తలు పనిచేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు రాపర్తి రాజు కోరారు. మండలంలోని తమ్మడపల్లి (జి)లో గుండెబోయిన రాజు అధ్యక్షతన బుధవారం నిర్వహించిన పార్టీ మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం స్థానికంగా ఆందోళనలు చేపట్టాలన్నారు. మండల కార్యదర్శి రాపర్తి సోమయ్య, నాయకులు కాట సుధాకర్, నక్క యాకయ్య, వేల్పుల రవి తదితరులు పాల్గొన్నారు.

‘జోనల్ వ్యవస్థను మార్చాలి’



మాట్లాడుతున్న పవన్‌కల్యాణ్

జఫర్‌గఢ్: కొత్త జిల్లాల ఏర్పాటు అనంతరం ఏర్పడిన జోనల్ వ్యవస్థ ఏమాత్రం సరిగా లేదని, ఈ విధానాన్ని వెంటనే మార్చాలని బహుజన విద్యార్థి యువజన జేఏసీ రాష్ట్ర కార్యదర్శి తుమ్మ పవన్ కల్యాణ్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన జోనల్ వ్యవస్థతో విద్య, ఉద్యోగ తదితర విషయాల్లో ఆయా ప్రాంతాల విద్యార్థులకు తీవ్ర నష్టం జరిగిందన్నారు. ముఖ్యంగా జఫర్‌గఢ్ మండలాన్ని యాదాద్రి జోన్‌లో చేర్చడంతో విద్య, ఉద్యోగంలో ఈ ప్రాంత విద్యార్థులు పోటీ పరీక్షల్లో ఇతరులతో సమానంగా అర్హత సాధించినా ఉద్యోగ అవకాశాలు పొందలేకపోతున్నారని అన్నారు. జఫర్‌గఢ్ మండలాన్ని తక్షణమే భద్రాద్రి జోన్‌లో చేర్చాలని ఆయన డిమాండ్ చేశారు. నాయకులు ముస్త్యాల నవీన్‌కుమార్, మాదారపు విజయ్‌కుమార్, సాగర్, అఖిల్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

శ్రద్ధగా చదివి ఉన్నత స్థాయికి ఎదగాలి



జఫర్‌గఢ్: సైకిళ్లు బహూకరిస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

స్టేషన్‌ఘన్‌పూర్: విద్యార్థులు శ్రద్ధగా చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని రోటరీ క్లబ్ బాధ్యుడు రాపోలు శేషారెడ్డి అన్నారు. రోటరీ క్లబ్ సహకారంతో మండలంలోని తాటికొండ ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలకు చెందిన 22 మంది విద్యార్థినులకు సైకిళ్లను బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గ్రామాల నుంచి సరైన రవాణా సౌకర్యం లేక విద్యార్థులు కొందరు చదువుకోలేక పోతున్నారని గమనించి రోటరీ బాధ్యులు బాలికల సౌకర్యార్థం 22 సైకిళ్లను పంపిణీ చేయడం జరిగిందన్నారు. విద్యార్థులు చదువుతో పాటు వ్యాయామం, ఆట పాటల్లో రాణించాలన్నారు. కాగా, విద్యార్థినులకు సైకిళ్ల బహూకరించిన రోటరీ క్లబ్, తాటికొండ వాస్తవ్యులు రాపోలు శేషారెడ్డిని ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

బాలికలు చదువులో రాణించాలి

జఫర్‌గఢ్: బాలికలు చదువులో మరింత రాణించాలని రోటరీ క్లబ్ ఆఫ్ హనుమకొండ సభ్యులు ఏవీఈ మురుగన్, కేఎస్ శివకామి అన్నారు. రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఏవీఈ మురుగన్ దంపతుల ఆర్థిక సహకారంతో ఉప్పుగల్లు ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన 11 మంది బాలికలకు రూ.50 వేల విలువ చేసే సైకిళ్లను ఉచితంగా బుధవారం బహూకరించారు. కాగా, విద్యార్థులకు ఉచితంగా సైకిళ్లు పంపిణీ చేసిన క్లబ్ సభ్యులను ఉపాధ్యాయులు అభినందించారు.

రైలుకింద పడి వృద్ధుడి మృతి

జనగామ రూరల్: ఆర్థిక ఇబ్బందులు, ఇతర సమస్యలతో రైలు కింద పడి వృద్ధుడు మృతి చెందిన ఘటన బుధవారం పట్టణంలోని రైల్వేస్టేషన్‌లో చోటు చేసుకుంది. రైల్వే పోలీసు రేవూరి రమణారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని గిర్నిగడ్డ ప్రాంతానికి చెందిన మాడిశెట్టి శివశంకర్ (63) మంగళవారం రాత్రి రైల్వేస్టేషన్ వద్ద రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం తెలుసుకొని ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపడుతున్నట్లు ఆయన తెలిపారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



పరామర్శిస్తున్న కడియం శ్రీహరి

రఘునాథపల్లి: మండలంలోని పలు గ్రామాల్లో ఇటీవల మృతి చెందిన కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే కడియం శ్రీహరి బుధవారం పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. నిడిగొండ గ్రామానికి చెందిన మానంపల్లి పుల్లాజీ, మారపాక లింగమ్మ, బానాజీపేటకు చెందిన మాటూరి రమేష్‌గౌడ్, చెరుకు వీరలక్ష్మి, బైరగోని శంబయ్య కుటుంబాలను పరామర్శించారు. రాంబాబు, రవి, శ్రావణ్‌కుమార్, శ్రీను, రాజు, సునీత, ఆంజనేయులు, వెంకట్‌రెడ్డి, బాబురావు, సంజీవరెడ్డి, లక్ష్మయ్య, ఉప్పలయ్య, ఉపేందర్, కొంరయ్య, శివప్రసాద్ ఉన్నారు.

కౌంటర్ వద్ద అందించే ఫారం నింపాలి

తరిగొప్పుల: ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా ఆయా గ్రామాల్లో నిర్వహించే గ్రామ సభలో ఏర్పాటు చేసిన కౌంటర్ వద్ద అందించే ఫారంనే నింపాలని, జిరాక్స్ సెంటర్లలో లభించే ఫారాలు చెల్లుబాటు కావని ఎంపీడీఓ దేవేందర్‌రెడ్డి అన్నారు. నేటి నుంచి మండల పరిధిలో చేపట్టే ప్రజా పాలన కార్యక్రమంపై స్థానిక రైతు వేదిక భవనంలో బుధవారం అంగన్‌వాడీ టీచర్లు, ఆశ కార్యకర్తలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడారు. కౌంటర్ల వద్ద లభించే ఫారాలను నింపి అక్కడే ఉన్న అధికారులకు అందజేసి రశీదు తీసుకోవాలని సూచించారు. రెండు ఫొటోలతో పాటు తెల్ల రేషన్ కార్డు, ఆధార్ కార్డు జిరాక్సులను తీసుకు రావాలని సూచించారు. తహసీల్దార్ కిష్టయ్య, మండల ప్రత్యేక అధికారి నాగులు, అదనపు ప్రత్యేక అధికారి నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

బచ్చన్నపేట: ప్రజా పాలన కార్యక్రమాలను అర్హులు వినియోగించుకోవాలని ఎంపీడీఓ రఘురామకృష్ణ అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. నేడు(గురువారం) ఆలింపూర్, బచ్చన్నపేట, బసిరెడ్డిపల్లి, 29తేదీన పోచన్నపేట, బండనాగారం, లక్ష్మాపూర్, 30న చిన్నరామన్‌చర్ల, గోపాల్‌నగర్, కొన్నె, దబ్బగుంటపల్లి, జనవరి 2న కేసిరెడ్డిపల్లి, ఖోనకొల్లూర్, కట్కూర్, వంగ సుదర్శన్‌రెడ్డి నగర్, 3న కొడవటూర్, ఇటుకాలపల్లి, రామచెంద్రాపురం, నక్కవానిగూడెం, 4న నాగిరెడ్డిపల్లి, గంగాపూర్, లింగంపల్లి, మన్‌సాన్‌పల్లి, 5వ తేదీన తమ్మడపల్లి, నారాయణపురం, పడమటికేశ్వాపూర్, సాల్వాపూర్‌లో దరఖాస్తులను స్వీకరించనున్నట్లు వివరించారు.

రఘునాథపల్లి: ఈ నెల 28 నుంచి జనవరి 5 వరకు మండలంలో ప్రజా పాలన సదస్సులు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ హసీం బుధవారం ప్రకటనలో తెలిపారు. 28వ తేదీన రఘునాథపల్లి, కంచనపల్లి, నిడిగొండ, 29న ఖిలాషాపూర్, కుర్చపల్లి, గోవర్ధనగిరి, మండలగూడెం, భానాజీపేట, అశ్వరావుపల్లి, 30న గబ్బెట, ఫతేషాపూర్, కోడూర్, మేకలగట్టు, కోమళ్ల, వెల్ది, జనవరి 2న శ్రీమన్నారాయణపురం, ఇబ్రహీంపూర్, ఎంబీతండా, జాఫర్‌గూడెం, రామన్నగూడెం, కన్నాయపల్లి, 3న యాపలగడ్డతండా, మాధారం, గిద్దబండతండా, శివాజీనగర్, సోమయ్యకుంటతండా, దాసన్నగూడెం, 4న ఎల్లారెడ్డిగూడెం, కుసుంబాయితండా, లక్ష్మితండా, పొట్టిగుబ్బటితండా, మల్లంపల్లి, ఆంధ్రతండా, 5వ తేదీన రామరాయనిబంగ్లా, పడమటిగూడెం, అయ్యవారిగూడెంలో సదస్సులు జరుగుతాయన్నారు.

దరఖాస్తుల స్వీకరణకు తేదీలు ఖరారు

జనగామ రూరల్: ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా మండలంలోని గ్రామాల్లో నిర్వహించే గ్రామ సభల తేదీల ఖరారయ్యాయి. ఏ తేదీన ఏ గ్రామంలో ఉందో ముందస్తుగా ప్రజలు తెలుసుకొని సిద్ధంగా ఉండాలని మండల ప్రత్యేక అధికారులు సంపత్‌కుమార్, మహిపాల్ రెడ్డి తెలిపారు. మండలంలో మొత్తం 21 జీపీలు ఉండగా 28వ తేదీన వడ్లకొండ, పెంబర్తి గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించి ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నారని తెలిపారు. 29వ తేదీన గానుపహడ్, పెద్దపహడ్, 30న ఓబుల్‌కేశావాపూర్, శామీర్‌పేట, ఎల్లంల, మరిగడి, జనవరి 2న ఎర్రగొల్లపహడ్, వెంకిర్యాల, పసరమడ్ల, చౌడారం, 3న చీటకోడూర్, సిద్దెంకి, పెద్దరాంచర్ల, యశ్వాంతాపూర్, 4న గోపిరాజుపల్లి, అడవికేశాపూర్, ఎర్రకుంటతండా, పెద్దతండా (ఎం) , 5వ తేదీన పెద్దతండా(వై) మండంలో పెద్ద గ్రామం అయిన పెంబర్తి లో 10 కొంటర్లు, వడ్లకొండలో 8 కొంటర్లు ఏర్పాటు చేశామన్నారు.

దేవరుప్పుల: ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ గ్రామ వేదికల వివరాలను ఎంపీడీఓ వడ్డెపల్లి ఉమామహేశ్వర్ తెలిపారు. 28వ తేదీన కడవెండి, పెద్దమదూరు, బంజర, చిప్పరాళ్లబండతండా, 29న కామారెడ్డిగూడెం,గొల్లపల్లి, చిన్నమదూరు, రంబోజీగూడెం, 30న దేవరుప్పుల, మున్‌పహడ్, చౌడూరు, కోలుకొండ, 2 వ తేదీన దారావత్‌తండా, ధర్మగడ్డతండా, దేవునిగుట్టతండా, దుబ్బతండా, 3 వ తేదీన సీతారాంపురం, పడమటితండా(ధర్మాపురం), నల్లకుంటతండా, రామచంద్రాపురం, 4 వ తేదీన పొట్టిగుట్టతండా, లాకావత్‌తండా(డీ), మాధాపురం, లాకావత్‌తండా (ఎం), 5 వ తేదీన లక్ష్మణ్‌తండా, సీత్యాతండా, నీర్మాల, రామరాజుపల్లి, 6 వ తేదిన సింగరాజుపల్లి, ధర్మాపురం, అప్పిరెడ్డిపల్లె, పడమటితండా(మాధాపురం)లో దరఖాస్తుల స్వీకరణ ఉంటుందన్నారు. ఆయా గ్రామాల్లో నిర్దేశిత తేదీల తర్వాత మరుసటి రోజు నుంచి రెండు రోజుల పాటు పంచాయతీ సిబ్బందికి కూడా దరఖాస్తులు అందజేయొచ్చని సూచించారు.